సంక్షేమ ఫలాలు అందేలా కృషి

- గత ప్రభుత్వంలా లంచాలు, పైరవీలు ఉండవు..
- పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు



పినపాక: ఈ బయ్యారం పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన పినపాక మండల పర్యటనలో భాగంగా ఏడూళ్ళ బయ్యారం, మల్లారం గ్రామాల్లో సుమారు రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన ఆయన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేదని, పైరవీలు అక్కర్లేదని తెలిపారు. మణుగూరులోని ప్రజాభవన్లో తాను అందుబాటులో ఉంటానని తనని నేరుగా కలిసి మీ సమస్యలు తెలిపితే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, యువజన కాంగ్రెస్ నాయకులు కొరస ఆనంద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, అర్జున్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వీరభద్రం, బాలకృష్ణ, మాజీ సర్పంచులు, సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం భ్రమరాంభ సమేత వైద్యనాథలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.50లక్షల నిధులతో చేపట్టనున్న వసతి గృహం, డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరు..

అశ్వాపురం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండల కేంద్రంలో జామా మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. మత పెద్దలు, మసీదు కమిటీ వారు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్.కె.ఖదీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు, ముస్లిం మత పెద్దలు

మృతుడి కుటుంబానికి పరామర్శ..

మండల పరిధిలోని అమెర్ద గ్రామానికి చెందిన ఇరుగు సురేష్ అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సురేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణ పనులు పరిశీలన



కరకట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో జరుగుతున్న కరకట్ట నిర్మాణ పనులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనుల జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుని, కరకట్ట నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రత్నం రమాకాంత్, నవాబ్, రాము, యూత్ అధ్యక్షుడు గాడి విజయ్, కార్యదర్శి ఆకుల వెంకట్, ఉపాధ్యక్షులు పుల్లగిరి నాగేంద్ర, కావూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ దీపాలు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని వలస గొత్తికోయ మానుగట్ట గ్రామంలో 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఏ కంపెనీ ఆధ్వర్యంలో, దుమ్ముగూడెం పోలీసుల సహకారంతో కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తుల కోరిక మేరకు వారికి కావాల్సిన సోలార్ విద్యుత్ దీపాలను ఇంటికి ఒకటి చొప్పున మొత్తం 40 సోలార్ విద్యుత్ దీపాలు అందజేశారు. చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, డ్రాయింగ్ మెటీరియల్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ ఇతరత్రా సామాన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సెకండ్ ఇన్ చార్జ్ ప్రీత, అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, దుమ్ముగూడెం సీఐ బి.అశోక్‌లు మాట్లాడుతూ.. మానుగట్ట గ్రామానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిధికి మించి వైద్యం చేయొద్దు



గ్రామీణ వైద్యశాలలో మందులను పరిశీలిస్తున్న వైద్యాధికారి దివ్యనయన

చర్లరూరల్: చర్ల మండలంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నందున గ్రామీణ వైద్యులు తమ పరిధిని మించి వైద్య చికిత్సలు చేయవద్దని సత్యనారాయణపురం మెడికల్ ఆఫీసర్ దివ్యనయన తెలిపారు. శుక్రవారం సత్యనారాయణపురం, ఆర్.కొత్తగూడెం గ్రామాల్లోని ఆర్ఎంపీ వైద్యశాలలను పరిశీలించారు. అనవసరంగా యాంటీబయోటిక్స్‌ను ఎక్కువగా వాడవద్దని సూచించారు. ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ వైద్యశాలలకు పంపించాలని కోరారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక

దుమ్ముగూడెం: మండల పరిధిలోని పాత జిన్నెలగూడెం ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థి సోయం అజయ్ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయినట్లు పాఠశాల హెచ్ఎం సోయం రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి పరీక్ష రాసి ఆంధ్రప్రదేశ్‌లోని కొరుకొండ సైనిక్ పాఠశాలకు ఉత్తీర్ణుడు కావడం సంతోషంగా ఉందన్నారు.

బూర్గంపాడు: సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ స్కూల్‌లో చదువుతున్న రుత్విక్‌రామ్, జయభార్గవ్, దీపక్ సాయి, రామ్‌తేజ్,పృథ్విసాయి చరణ్‌రెడ్డి, నేత్ర నిఖిల్, అజయ్‌కుమార్, గౌతమ్‌లు మంచి మార్కులు సాధించి సైనిక్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు(బీఎస్ఆర్), హెచ్ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

20 నుంచి జాతర

గుండాల: సనప వంశీయుల ఇలవేల్పు గోవిందరాజు జాతరను ఈ నెల 20 నుంచి నిర్వహించడం జరుగుతుందని సనప వంశీయులు తెలిపారు. శుక్రవారం చెట్టుపల్లిలో గోవిందరాజు జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20న బుధవారం దేవాలయ శుద్ధి, మంగళవాయిద్యాలతో తోరణబంధన, 21న గురువారం ఒక్కపొద్దు దేవుడిని గద్దెలపైకి తీసుకురావడం, ఊరేగింపు ఉంటుందని, 22న శుక్రవారం భక్తుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ జాతర సందర్భంగా వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జాతరను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సనప కోటేశ్వరావు, సనప సుగుణరావు, తలపతి రాంబాబు, స్వామి, రాంచందర్, శ్రీను, జగ్గారావు, కృష్ణ, సుధాకర్, నాగేశ్వరరావు, సర్వయ్య పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాలలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్సీరాం 90వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలను చైతన్యపరిచి రాజ్యాధికారం యొక్క రుచి చూపించిన మహనీయుడు కాన్సీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీసంపల్లి నరసింహారావు, ఇల్లెందుల శేషావతారం, గొల్లమందల పెంటయ్య, యువజన నాయకులు కొప్పుల శేఖర్, సోషల్ మీడియా పీఆర్పీ, నియోజక వర్గ కోశాధికారి కొప్పుల నారాయణ, సొందే జానకి రావ్, కల్లూరి బాలు, సోందె కృష్ణ, సొందె కరీం,జజ్జరి సుమన్, సొందే రామకృష్ణ పాల్గొన్నారు.

చర్ల: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 90వ జయంతి వేడుకలు శుక్రవారం చర్లలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుంచి వచ్చిన మాయావతిని సీఎం సీట్లో కూర్చోబెట్టిన ఘనత కాన్షీరాంకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో తోటమళ్ల శ్రావణ్, ఏనూటి సందీప్, బట్టా మధు, సినిగిరి పవన్, ఏనూటి దేవానందం, ఏనూటీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి



వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశువైద్యాధికారిణి స్వప్న

అశ్వారావుపేటరూరల్: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్వప్న కోరారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో 648 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఏప్రిల్ 15వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆవులు, ఎడ్లు, గేదెలు, దూడలకు యాజమానులు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎండి.మదార్, దుర్గా భవాని, రేఖారాణి, బాబ్జీ, ధర్మ, పుల్లారావు, రాము, అశోక్ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన యువకుడు ప్రవీణ్‌కుమార్ గురువారం రాత్రి బైక్‌పై వస్తుండగా ఇరవెండి–సారపాక రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. యువకుడిని భద్రాచలం తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం హైదరాబాద్ తరలించారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డుకు భూమిపూజ

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి భూమిపూజ చేశారు. పాఠశాల బజార్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ ద్వారా రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. మాజీ ఉపసర్పంచ్ దారావత్ రామారావు, మచ్చా కుమార్, గాదె లింగయ్య, ఎస్డీ గఫార్ పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని చాపరాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పల్లమోతు జగదీష్, సన్నం సుధాకర్, మాచినేని మునేశ్వరరావు, సున్నా జగదీష్, చీకటి ముత్తయ్య, చీకటి వెంకటేశవర్లు, శనగపాటి నవి, ఖాదర్‌బాబా, కటికనేని ఆదిత్య, జీపీ కార్యదర్శి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

దిగుబడులిచ్చే విత్తనాలనే నాటాలి

గుండాల: ఖరీఫ్‌లోనైనా, యాసంగిలోనైనా అధిక దిగుబడులను ఇచ్చే మొక్కజొన్న విత్తనాలను నాటుకోవాలని ఎంపీపీ ముక్తి సత్యం అన్నారు. శుక్రవారం ముత్తాపురం గ్రామంలో ప్రభాత సీడ్స్ హైబ్రీడ్ మొక్కజొన్న పంటపై రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఈ రకం మొక్కజొన్న పంటను సరైన యాజమాన్య పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడినిస్తుందని గుర్తు చేశారు. అధిక, తక్కువ వర్షపాతాలను తట్టుకుని పెద్దసైజు కంకితో పాటు, బరువుగల గింజను తీస్తుందని తెలిపారు. ఈ ప్రాంత రైతులు మంచి దిగుబడులను అందించే పంటలనే ఎంపిక చేసుకోవాలని సూచించారు. డీఆర్ఎం పాండురంగారెడ్డి, ఏరియా మేనేజర్ సుబ్బారావు, మానాల ప్రణీత్, రమేష్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం..

అశ్వారావుపేటరూరల్: కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ సభ్యురాలు రేణుక చౌదరికు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, సుంకవల్లి వీరభద్రరావు, కాసాని వెంకటేశ్వరరావు, సంకురాత్రి సతీష్, తలశీల ప్రసాద్, అల్లూరి బుజ్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంబీపీఎంకు సన్మానం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ఏబీపీఎం వెంగాల ప్రవీణ్ కుమార్ రెడ్డికి దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి గుడిలో పోస్టల్ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. ప్రవీణ్ కుమార్ రెడ్డి ఎంటీఎస్ డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై హైదరాబాద్ హెచ్ఆర్ఓ యూనిట్ డివిజన్‌లో ఎంటీఎస్‌గా ప్రమోషన్ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం సబ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్ మాస్టర్ ఎస్.ప్రసాద్ రెడ్డి, ఎంటీఎస్ పూర్ణదుర్గ, మెయిల్ వర్సెస్ గోపాలరావు, దుర్గాప్రసాద్, లక్ష్మీనగరం ఏబీపీఎం వీర్రాజు, సీతారాంపురం బీపీఎం కోటిరెడ్డి, గంగోలు ఏబీపీఎం సాగర్, సీతారాంపురం ఏబీపీఎం శ్రీను, పలు జీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

పినపాక: ఉప్పాక గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంట వలస ఆదివాసీ గ్రామంలో శుక్రవారం ఎమ్ఎల్ హెచ్‌పీ రామరాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని మాట్లాడారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి మృతికి సంతాపం

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెంకు చెందిన వ్యాపారి ఆర్.రహ్మతుల్లా(45) శుక్రవారం మృతి చెందగా పలువురు సంతాపం తెలిపారు. తమిళనాడుకు చెందిన ఆయన కుటుంబం 40ఏళ్ల క్రితం వచ్చి కిరాణ వ్యాపారం ప్రారంభించారు. రంజాన్‌లో ఉపవాస దీక్ష చేస్తున్న రహ్మతుల్లాను శుక్రవారం తెల్లవారుజామున ప్రార్థనకు వెళ్లేందుకు సోదరుడు నిద్ర లేపేందుకు ప్రయత్నిస్తే స్పందించలేదు. దీంతో స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించగా అంత్యక్రియల నిమిత్తం స్వస్థలానికి తరలించారు.

ముత్యాలరావుకు ఎమ్మెల్యే..

మణుగూరుటౌన్: మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పల్లపు తిరుమలేష్ కుమారుడు ముత్యాలరావు శుక్రవారం గుండెనొప్పితో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదర్శనగర్‌లోని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు నాగేశ్వరరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



కన్నాయిగూడెం పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ కుమార్

కరకగూడెం: పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కరకగూడెం ఎంపీఓ కుమార్ హెచ్చరించారు. మండలంలోని పల్లె ప్రకృతి వనాలపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్న విషయాన్ని తెలియజేస్తూ శుక్రవారం 'సాక్షి'లో 'ఆహ్లాదం ఆటకెక్కినట్టే' అనే శీర్షికన కథనం స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీఓ కుమార్ కన్నాయిగూడెం, సమత్ భట్టుపల్లి, రేగళ్ల, వెంకటాపురం తదితర గ్రామ పంచాయతీల పల్లె ప్రకృతి వనాలను తనిఖీ చేసి పరిశీలించారు. వనాల్లో నాటిన మొక్కలు లేకపోవడం, అస్తవ్యస్తంగా నిర్వహణ ఉండడం పట్ల తీవ్ర అసహనానికి గురయ్యారు. ధ్వంసమైన మొక్కల స్థానంలో నూతన మొక్కలు నాటి, రెండు రోజులకు ఒక సారి ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం నర్సరీలను సందర్శించి నాటిన ప్రతీ మొక్కను కాపాడల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బహుమతి ప్రదానం

చర్లరూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గురుదేవ్ విద్యానిలయంలో ఫిబ్రవరి 21న జరిగిన తెలుగుభాష శతక పద్యాల పోటీలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సంపాదించిన విద్యార్థులకు శుక్రవారం ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయురాలు వంగర సుజాతల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. గురుదేవ్ ప్రిన్సిపాల్ గిరి ప్రసాద్, కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు

కరకగూడెం: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కరకగూడెం ఎంపీఓ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని కరకగూడెం, కన్నాయిగూడెం గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభలకు హాజరై మాట్లాడారు.. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలి సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తుల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్యామ్ సుందర్ రెడ్డి, తరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సహకరించాలి..

అశ్వారావుపేటరూరల్: పార్టీలకు అతీతంగా చేపట్టే అభివృద్ధి పనులను సహకరించాలని, అడ్డుకుంటే సహించేదిలేదని స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం కాలనీ పంచాయతీలో రూ.4లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు వగ్గెల పూజ, తాడేపల్లి రవి ఉన్నారు.

తాగునీటి బోరు నిర్మాణం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ సూర్యంపేట గ్రామంలో తాగునీటి బోరు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యదర్శి మహేశ్వరి, గ్రామ నాయకులు పరిటాల సందీప్ కుమార్, పసుపులేటి కొండయ్య, నరేష్, చిన్ని పాల్గొన్నారు.

చైర్మన్ పదవి ఇవ్వాలి

చంద్రుగొండ: మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవిని కొండా దేవయ్యకు ఇవ్వాలని సంఘం మండల అధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య కోరారు. పోకలగూడెం గ్రామంలో శుక్రవారం సంఘంశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాపుకులస్తుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్యకే ఆ పదవి కేటాయించాలని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్‌కట్ చేశారు. నాయకులు వెలగల మధు, గాజుల ప్రసాద్, రాము, బ్రహ్మం, పాలెపు వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్‌పక్వాడ్'



ములకలపల్లి: పూసుగూడెంలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

ములకలపల్లి: మండలపరిధిలోని పూసుగూడెంలో శుక్రవారం పోషణ్‌పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార అవశ్యకతను వివరించారు. ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పూసుగూడెం క్లస్టర్ సూపర్‌వైజర్ జ్ఞానసుందరి, అంగన్‌వాటీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. సీతాయిగూడెం జీపీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ కె.సీతారాములు, జగన్నాథపురం క్లస్టర్ సూపర్‌వైజర్ నాగమణి, ఏడబ్ల్యూటీఎస్ బాలామణి, నాగేశ్వరి, వాణి, సత్యావతి, తిరుపతమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు సెక్టార్ పరిధిలోని నెల్లిపాకబంజర అంగన్‌వాడీ కేంద్రంలో నెల్లిపాక, రామచంద్రాపురం గ్రామ పంచాయతీల అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభాస్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ రేవతి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు మంగతయారు, రత్నకుమారి, కరుణ, సుమతి, సక్కుబాయి, అలివేలు, తల్లులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

అశ్వారావుపేటరూరల్: ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణ ఉండాలని, అప్పుడు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అందుకుంటారని ప్రధానోపాధ్యాయులు పున్నం చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం గ్రామంలోని ప్రాథమికోన్న పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.హరినాథ్‌బాబు, శ్రీనివాసరెడ్డి, రామారావు, రమేష్, బుల్లెమ్మ, సుజాత, రేణుక పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ

మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వితరణ అందించారు. శుక్రవారం గ్రామానికి చెందిన బొల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలపై అవగాహన



ఐటీఐ ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ జీ.రవికుమార్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ సారథంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఐటీఐ ప్రవేశాలు, ఆవశ్యకత వంటి వివరాలను తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం ఐటీఐలో కోర్సులు, ప్రవేశాలు ఎలా పొందాలనే విషయాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. అనంతరం పది పరీక్షలు రాయనున్న విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ, ఏటీఓ ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



గుండాల: ఎస్సెస్సీ విద్యార్థులతో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

బూర్గంపాడు: బూర్గంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల) పదో తరగతి విద్యార్థులకు సురక్షిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు ఏడు రకాల పరీక్ష సామగ్రిని అందించి, పరీక్షలలో మంచి ఫలితాలు తెచ్చుకోవాలని సురక్షిత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుదిగొండ్ల రవికుమార్ కోరారు. కార్యక్రమంలో తోకల రవిప్రసాద్, ప్రధానోపాధ్యయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండాల: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలం మర్కోడు గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి ఆలోచనలు, టెన్షన్ పెట్టుకోకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేయరాదని, ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్లపల్లి ఎస్సై రతీష్ తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: క్రమశిక్షణతో చదివి విద్యలో రాణించాలని ఎస్సై టీవీఆర్ సూరి అన్నారు. శుక్రవారం కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థినులకు ఖమ్మంలోని సత్యమార్గం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.11 వేల విలువ చేసే పరీక్షా కిట్‌లను ఎస్సై చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఝుంకీలాల్, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బి.సరోజిని, సత్యమార్గం సొసైటీ సభ్యులు దొడ్డి హరినాగవర్మ, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.